దళితవాడల్లో అభివృద్ధి పరుగు


బొప్పాయిపురంలో నిర్మాణ దశలో ఉన్న భవనం

● జోరుగా సామాజిక భవనాల నిర్మాణం

టెక్కలి: దళితుల అభివృద్ధే ధ్యేయంగా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతోంది. ఇందులో భాగంగా మండలంలోని పలు దళిత వాడల్లో సామాజిక భవనాల నిర్మాణాలను చేపడుతున్నారు. మొదటి విడతగా టెక్కలిలోని ఆదిఆంధ్రావీధి, లింగాలవలస, బొప్పాయిపురం గ్రామాల్లో ఐదు లక్షల రూపాయల మండల పరిషత్ నిధులతో సామాజిక భవనాల నిర్మాణాలను ప్రారంభించారు. బొప్పాయిపురం గ్రామంలో సామాజిక భవనం శ్లాబు పనులు పూర్తయ్యాయి. లింగాలవలస, ఆదిఆంధ్రావీధిలో భవనాల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. వీటితో పాటు మండలంలోని పలు దళిత వాడల్లో అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల కల్పన కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపడుతున్నారు. శ్మశానవాటికల్లో షెడ్లు, సీసీ రోడ్లు నిర్మించేందుకు అంచనాలు రూపొందించారు.

దళితవాడల్లో పూర్తిస్థాయిలో అభివృద్ధి



గత ప్రభుత్వ హయాంలో దళిత వాడల్లో సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దళితులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆయన ఆలోచనలకు అనుగుణంగా మండల పరిషత్ నిధులతో దళిత వాడల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం.

–అట్ల సరోజనమ్మ,ఎంపీపీ, టెక్కలి

యాదవులకు సముచిత స్థానం


సత్కారం పొందిన రామారావు దంపతులు

కవిటి: యాదవ సామాజికవర్గానికి చెందిన నర్తు రామారావుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడం గొప్పవిషయమని వక్తలు అన్నారు. తలగానపుట్టుగలో యలమంచిపుట్టుగ, బార్లపుట్టుగ తదితర గ్రామాలకు చెందిన యాదవసామాజికవర్గం ప్రతినిధుల సమక్షంలో రామారావు, చామంతి దంపతులను ఆదివారం ఘనంగా సత్కరించారు. తొలుత బార్లపుట్టుగ నుంచి వారిని వాయిద్యాల నడుమ యువకులు నృత్యం చూస్తూ ఊరేగింపుగా తలగానపుట్టుగకు చేరుకున్నారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. యాదవసామాజిక వర్గానికి గుర్తింపు గౌరవం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమన్నారు. రానున్న సాధారణ ఎన్నికల్లో ఇచ్ఛాపురం అసెంబ్లీ స్థానంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని అఖండ మెజారిటీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత రజనీకుమార్‌దొళాయి, గ్రామస్థులు తలగాన భూషయ్య పాల్గొన్నారు.

గిరిజనుల భూముల పరిశీలన


భూములను పరిశీలిస్తున్న సంఘ నాయకులు

మందస: గిరిజన ప్రాంతాల్లో గిరిజనేతరులు చేస్తున్న అక్రమాలను అరికట్టాలని ఆదివాసీ గిరిజన సంఘం, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు కొండలోగాం పంచాయతీ చాపరాయి ప్రాంతంలో గిరిజనుల భూములను ఆదివారం పరిశీలించారు. భూములను కొంతమంది ఆక్రమించి, పచ్చని టేకు చెట్లను తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా సాగు చేస్తున్న భూముల్లోని చెట్లను గిరిజనులపై దాడి చేసి తీసుకుపోతున్నారని ఆరోపించారు. గిరిజనులకు అన్ని హక్కు పత్రాలు ఉన్నప్పటికీ, ఆక్రమణదారులు దౌర్జన్యాలు చేస్తున్నారన్నారు. గిరిజనుల భూములే వారికే చెందాలని, లేదంటే పోరాటం చేస్తామన్నారు. పరిశీలనలో ఆయా సంఘాల నాయకులు కె.మోహనరావు, సవర ధర్మారావు, సవర ఫల్గుణరావు, జయరాజ్, బాలకృష్ణ, జగ్గారావు, తిరుపతి, రామారావు, జొరాడు ఉన్నారు.

కంచిలి పట్టణంలోకి బస్సులు రాకపోవడం దారుణం


బస్సుల సమస్యపై చర్చిస్తున్న స్థానికులు

కంచిలి: చాలా బస్సు సర్వీసులు మండల కేంద్రం కంచిలి పట్టణంలోకి రాకపోవడం దారుణమని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు స్థానిక రైల్వేస్టేషన్ కూడలి వద్ద ఆదివారం సాయంత్రం గ్రామస్తులంతా సమావేశమయ్యారు. సుమారు రెండేళ్లుగా గ్రామంలోకి బస్సులు పూర్తిస్థాయిలో రావడం లేదని వాపోయారు. ఆర్టీసీ తోపాటు ఈ రూట్‌లో పర్మిట్ పొందిన ప్రైవేటు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు కూడా రావడం లేదన్నారు. ఈ విషయన్ని పలుసార్లు సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేయడం, తర్వాత కొన్నాళ్లు కరెక్టుగా నడిచినప్పటికీ, తర్వాత యథాప్రకారం ఊరిలోకి బస్సు సర్వీసులు రాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం స్థానిక ఎస్సై ఎస్.బాలరాజును కలిసి వినతిపత్రం అందజేయడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. బస్సు రూట్లను పరిశీలించి పట్టణంలోని బస్సు సర్వీసులు వచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకొంటామన్నారు. సమస్యను ఆర్టీసీ అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్తామని గ్రామస్తులు తెలిపారు.

బదిలీ ఉపాధ్యాయుడుకి సత్కారం

వజ్రపుకొత్తూరు రూరల్: విధి నిర్వహణలో చేసిన సేవలతోనే గుర్తింపు లభిస్తుందని పలువురు వక్తలు అన్నారు. చినడోకులపాడు ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు సీపాన రామచంద్రరావును గ్రామస్తులు ఆదివారం సన్మానించారు. చిన్నారులను ఉన్నతంగా తీర్చిదిద్దడంతో పాటు గ్రామాభివృద్ధికి ఉపాధ్యాయుడు కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

కురవని వాన..రైతన్న ఆందోళన


ధర్మపురంలో ఎండిన వరిపొలం

ఇచ్ఛాపురం రూరల్: వాతావరణ పరిస్థితులు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కొద్దిరోజులుగా వరుణుడు కరుణించక పోవడంతో వేసినవరినాట్లు, వెదచేలు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే పంటలను నష్టపోతామంటున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో జంట పట్టణాలను కలిపే కేటీ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా సోమవారం విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్టు లైన్‌ఇన్‌స్పెక్టర్ గార రాజారావు ఆదివారం తెలిపారు. ఉదయం పది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు చేపల మార్కెట్, ఉదయపురం, పురుషోత్తపురం, సూదికొండ, శివాజీనగర్, సాయికాలనీ, వివేకానంద కాలనీ పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నామని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

మంత్రిని కలిసిన సాక్షరభారత్ కోఆర్డినేటర్లు


మంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో సాక్షర్ భారత మండల కో–ఆర్డినేటర్లుగా చాలామంది పని చేశారు. గత ప్రభుత్వ హయాం నుంచి వీరంతా ఖాళీగా ఉన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు వారందరినీ తిరిగి మండల కో–ఆర్డినేటర్లుగా ఇటీవల నియమించారు. ఇచ్చిన మాట నెరవేర్చారని పలాస మండల కో–ఆర్డినేటర్ కోరాడ కరుణ్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీదిరి అప్పలరాజును తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి ఉంగ సాయికృష్ణ ఉన్నారు.

శాంతియుత జీవనం అవసరం


కట్టుపని సంఘ ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న బ్రహ్మకుమారీ

సోంపేట: సమాజంలో ప్రతిపౌరుడు శాంతియుత జీవనం అలవాటు చేసుకోవాలని బ్రహ్మకుమారీలు అన్నారు. సోంపేట పట్టణంలోని లోకనాదేశ్వర దేవాలయం వద్ద ఆదివారం లోకనాదేశ్వర కుట్టుపని సంక్షేమ సంఘ ప్రతినిధులతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కుట్టుపని సంక్షేమ సంఘ ప్రతినిధులకు బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు రాఖీలు కట్టారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పొందూరు గంగారావు, సాహుకారి జాని పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నిమ్మన దాస్

సోంపేట: ఇంటర్మీడియెట్ స్థాయిలోనే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఎంపీపీ నిమ్మన దాస్ అన్నారు. సంస్కారభారతి విద్యాసంస్థల్లో ఆదివారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. 2022–23 విద్యా సంవత్సరంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో చైర్మన్ ఎన్ని దేవరాజు, డైరెక్టర్ బి.శ్రీనుబాబు, ప్రిన్సిపాల్ కవిబాబు, ఏవో పాపారావు పాల్గొన్నారు.

నేడు సచివాలయం, పీహెచ్‌సీ భవనాలు ప్రారంభం

టెక్కలి: కోటబొమ్మాళి మండలంలో సోమవారం పలు ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు వాండ్రాడలో గ్రామ సచివాలయం, పది గంటలకు నిమ్మాడ జంక్షన్ వద్ద ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాలను మంత్రి ధర్మాన ప్రసాదరావు చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలంతా హాజరు కావాలని కోరారు.

ఆస్పత్రికి వెళ్లి.. పింఛన్ అందజేసి..


అప్పారావుకు పింఛన్ అందజేస్తున్న అశ్విని

నందిగాం: దిమిలాడ గ్రామానికి చెందిన వృద్ధుడు సీపాన అప్పారావు కాలు విరిగిపోవడంతో శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఇతనికి ఈ నెలకు మంజూరైన పింఛన్ మొత్తాన్ని వలంటీర్ మడ్డు అశ్విని ఆదివారం ఆస్పత్రికి వెళ్లి అందజేసి ఆదర్శంగా నిలిచారు.

మృతుని కుటుంబానికి పరామర్శ


బలరాంరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాజలక్ష్మి తదితరులు

ఇచ్ఛాపురం రూరల్:

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మండపల్లి మాజీ సర్పంచ్ బర్రి బలరాంరెడ్డి ఇటీవల మృతి చెందారు. ఇతని కుటుంబ సభ్యులను ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, కౌన్సిలర్లు తాడి ఆదిరెడ్డి, సుగ్గు ప్రేమ్‌కుమార్‌రెడ్డి, చిడిపోతు జగన్, సర్పంచ్ పిట్ట మామయ్యరెడ్డి, పిలక సంతోష్, ప్రకాశ్ పట్నాయక్ ఆదివారం పరామర్శించారు.

అప్పయ్యదొర వర్ధంతి రేపు

కాశీబుగ్గ: దివంగత మాజీ ఎంపీ హనుమంతు అప్పయ్యదొర వర్ధంతి కార్యక్రమాన్ని ఈ నెల ఐదో తేదీన కాశీబుగ్గ బెండిగేటు వద్ద నిర్వహిస్తున్నట్టు కుటుంబ సభ్యుడు రామ్మోహనదొర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో మంత్రి సీదిరి అప్పలరాజు హాజరవుతారన్నారు.

ఫిష్ ఆంధ్ర మినీ అవుట్‌లెట్ ప్రారంభం


ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: వినియోగదారులకు నాణ్యమైన చేపలు, రొయ్యలు తక్కువ ధరకే అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఫిష్ ఆంధ్ర మినీ అవుట్‌లెట్లకు శ్రీకారం చుట్టిందని మండల సచివాలయ కన్వీనర్ వడ్డి కరుణాకర్ అన్నారు. చినడోకులపాడులో ఆదివారం ఫిష్ ఆంధ్ర మినీ అవుట్‌లెట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినియోగదారులకు నాణ్యమైన సముద్ర, చెరువు చేపలు, రొయ్యలతో పాటు చికెన్, మటన్‌లను ఈ కామర్స్ తరహాలో అందించనున్నామన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మత్స్య సంపదను ప్రాసెసింగ్ చేసి అమ్మకాలు చేపట్టడంతో ఈ షాపులకు డిమాండ్ పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కొయిరి ఢిల్లీరావు, మత్స్యకార సంఘ అధ్యక్షుడు యంపల్ల పాపారావు, సచివాలయ కన్వీనర్ బి.మోహన్‌రావు, రెయ్యి బాలక్రిష్ణ, బి.రామారావు, కన్నా జయరాం, రాజేష్ ఉన్నారు.

పశుదాణా పంపిణీ


పశుదాణాను అందజేస్తున్న దృశ్యం

కంచిలి: గోవులకు అవసరమైన దాణాను రామ్‌కో సిమెంట్ అధీకృత డీలర్లు సోంపేట మండలం బారువ పరిధి గొల్లగండి గ్రామంలో గల 'చిలుకూరి బాలాజీ గోశాల' యాజమన్యానికి ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో కంచిలికి చెందిన డీలర్ ఇప్పిలి ప్రవీణ్ కుమా పాల్గొన్నారు.



● ఇంజాద్రమ్మ తల్లికి చల్లదనం

వర్షాలు లేక పంట పొలాలు ఎండిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని.. కరుణించి వర్షాలు కురిపించాలని మెళియాపుట్టి మండలంలోని మర్రిపాడు–సి పంచాయతీ పరిధి జలకలింగుపురం గ్రామస్తులు మెళియాపుట్టి సమీపంలోని కొండపైనున్న ఇంజాద్రమ్మ గ్రామదేవతకు ముర్రాటలు చెల్లించారు. గ్రామంలోని హహిళలు, రైతులంతా కలిసి ఆదివారం ఘటాలతో కొండ పైకి వెళ్లి ఇంజాద్రమ్మ తల్లికి చల్లదనం చేశారు. గ్రామపెద్ద కొల్లి వెంకటరావు మాట్లాడుతూ ప్రతి ఏటా వర్షాలు పడాలని ఇంజాద్రమ్మ తల్లికి పూజించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఇలా చేయడంతో వర్షాలు పడి పంటలు సుభిక్షంగా పండుతాయని విశ్వసిస్తామన్నారు. దుక్క బాలరాజు పాల్గొన్నారు. - మెళియాపుట్టి

దోమల నివారణకు చర్యలు


సీతాపురంలో దోమల మందును పిచికారీ చేస్తున్న దృశ్యం


వజ్రపుకొత్తూరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే కాకుండా దోమలను నివారించుకునే బాధ్యత మనందరిపై ఉందని పెద్దబొడ్డపాడు సర్పంచ్ తమ్మినాన ఢిల్లీరావు అన్నారు. సీతాపురం, పెద్దబొడ్డపాడు గ్రామాల్లో ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న పొదలను తొలగించేందుక పొదలపై కలుపు నివారణ మందును స్ప్రే చేయడమే కాకుండా , దోమల నివారణకు క్లోరో ఫైరిపాస్ మందును ఆదివారం కార్మికులతో చల్లించారు. మూడు రోజులు పాటు పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడతామన్నారు.

ఘనంగా 'తెరవే' సాహితీ సమ్మేళనం


కవులను సత్కరిస్తున్న తెరవే సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని శాంతినికేతన్ జూనియర్ కళాశాలలో తెలుగు రచయితల వేదిక (తెరవే) ఆధ్వర్యంలో ఆదివారం 84వ నెలవారీ సాహితీ సమ్మేళనం జరిగింది. సంస్థ అధ్యక్షులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి ఆర్.వి.రమణమూర్తి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం ప్రధాన అంశంగా 12 మంది కవులు తమ కవితలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా తెరవే గౌరవ సభ్యులు పి.వి. దుర్గాప్రసాద్, ప్రముఖ కవి రచయిత జంధ్యాల శరత్‌బాబులను సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు.నిక్కు హరిసత్యన్నారాయణ, తంగి యర్రమ్మ, బి.జగన్నాథరావు, ఐఎస్‌డీ ప్రసాద్, తోట గోపాలరావు,పూడి జనార్ధనరావు పాల్గొన్నారు.

అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ట


స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

ఇచ్ఛాపురం రూరల్: బలరాంపురం గ్రామంలోని కొత్తవీధిలో ఏర్పాటు చేసిన అభయాంజనేయ విగ్రహాన్ని ఆదివారం ప్రతిష్ఠించారు. ఉదయం వేద పండితుల పారాయణంతో ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ చేశారు. ముందుగా గోపూజ, బహుదానది నుంచి భక్తులు కలశాలతో గంగా జలాన్ని ఊరేగింపుగా తెచ్చి పంచామృతంతో అభిషేకం చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పొంచిఉన్న ప్రమాదం!


పోలవరం వద్ద ప్రమాదకరంగా ఉన్న వంతెన

టెక్కలి: టెక్కలి నుంచి పాతపట్నం వెళ్లే మార్గంలో పోలవరం గ్రామం వద్ద వంశధార కాలువ వంతెనకు రక్షణ గోడలు లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉందని ఈ మార్గంలో ప్రయాణించేవారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో నిత్యం భారీ వాహనాలు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే కాలువ వద్ద రక్షణ గోడలు లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. అధికారులు పరిశీలన చేసి రక్షణ గోడలు నిర్మాణం చేయాలని గ్రామస్తులతో పాటు వాహన చోదకులు కోరుతున్నారు.

ఉపాధ్యాయుడు మృతికి సంతాపం



మందస: మందస పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు పి.శామ్యూల్‌రాజు (46) ఆదివారం ఆకస్మికంగా మరణించారు. తెలంగాణాలో పని చేస్తున్న ఈయనకు బ్రెయిన్‌స్ట్రోక్ రావడంతో అక్కడే మరణించారు. శామ్యూల్‌రాజు తల్లి ఎలిజిబెత్ ఇటీవలే మరణించగా, సోదరుడు జోషఫ్ కూడా చనిపోయారు. వరుసగా కుటుంబసభ్యులను కోల్పోయిన వారి కుటుంబాన్ని ఓదార్చడం ఎవరి తరం కావడంలేదు. మృతునికి భార్య శ్వేత, కుమార్తె సృజన ఉన్నారు. మృతదేహాన్ని తెలంగాణ నుంచి మందసకు తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబీకులు తెలిపారు. శామ్యూల్‌రాజు మృతిపై పలువురు సంతాపం తెలియజేశారు.

22 ద్విచక్ర వాహనాలు సీజ్


పోలీస్‌స్టేషన్ ఆవరణలో సీజ్ చేసిన వాహనాలు

టెక్కలి: ఎటువంటి పత్రాలు లేకుండా ఉన్న 22 ద్విచక్ర వాహనాలను టెక్కలి పోలీసులు సీజ్ చేశారు. టెక్కలి, నౌపడ ఎస్సైలు రామకృష్ణ, రమేష్, కిశోర్‌వర్మతో పాటు సిబ్బంది పట్టణంలోని గొల్లవీధి, రామదాసుపేట వీధుల్లో ఆదివారం ఉదయం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎటువంటి పత్రాలు, సక్రమంగా నంబర్ ప్లేట్లు లేకపోవడం, ఎంవీఐ చలానాలు పెండింగ్ ఉన్న 22 ద్విచక్ర వాహనాలను గుర్తించి సీజ్ చేశారు. వీటిని పోలీసుస్టేషన్‌కు తరలించారు.

ఉద్దానంలో కృష్ణాష్టమి వేడుకల సందడి


విరాళాల సేకరణలో స్వాములు

కవిటి: మండలంలోని వివిధ గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకల సందడి నెలకుంది. ఈ నెల ఏడో తేదీన వేడుకల్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి. సన్యాసిపుట్టుగ శ్రీకృష్ణ మందిరంలో చాత్తద శ్రీవైష్ణవుల ఆధ్వర్యంలో ఈ వేడుకల్ని అన్నివర్గాల ప్రజల భాగస్వామ్యంతో వైభవంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా చాత్తదశ్రీవైష్ణవులు గ్రామాల్లో వేడుకల నిర్వహణకు భక్తుల నుంచి విరాళాల సేకరణలో నిమగ్నమయ్యారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


రోడ్డు పనులను పరిశీలిస్తున్న చిట్టిబాబు

పలాస: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను చేరువ చేస్తున్నామని పలాస పీఏసీఎస్ అధ్యక్షుడు పైల చిట్టిబాబు చెప్పారు. బ్రాహ్మణతర్లా గ్రామంలోని ఇందికాలనీలో ఆదివారం ఉదయం గుడ్‌మార్నింగ్ కార్యక్రమం చేపట్టారు. కాలనీలో కొత్తగా వేస్తున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. అలాగే ఇంటింటికి వెళ్లి ప్రజల యోగ క్షేమాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అన్ని వీధులకు సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలను చేపడుతున్నట్టు పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెంటింటిని చేపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు దంతం వైకుంఠరావు, పొందర ఈశ్వరరావు, కర్ర గంగాధరరావు, గరికి ధర్మారావు, కోరాడ నాగరాజు, తులసి, పొందర అప్పన్న పాల్గొన్నారు.